నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 12 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఆన్‌లైన్ సేవలకు అంతరాయం..ఆగిన రిజిస్ట్రేషన్లు


భూముల క్రయ, విక్రయ దారులు లేక వెలవెల బోతున్న కార్యాలయం ఆవరణ

హాజీపూర్, జూలై 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఆన్ లైన్ సేవలకు అంతరాయం కలగడంతో భూముల క్రయ-విక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో అమ్మకం, కొనుగోలు దారులు తమ ఆధార్ కార్డులను భూమి పత్రాలకు జత చేయాల్సి ఉంటుంది. యూఐడీఏఐ లింక్ ద్వారా ఆధార్ నంబర్‌ను కేవైసీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కార్యాలయానికి విక్రయ, కోనుగోలు దారులు విషయం తెలుసుకొని వెనుదిరిగారు. గురువారం దాదాపు 60 భూ రిజిస్ట్రేషన్లు నిలిచి పోయినట్లు ఇన్‌చార్జి సబ్-రిజిస్ట్రార్ అశోక్ కుమార్ తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ


రైతులను వివరాలు అడిగి తెలుసుకున్న ఏసీపీ వెంకటేశ్వర్

భీమారం, జూలై 11 : మద్దికల్ శివారు ప్రాంతంలోని 37 ఎకరాల పత్తి పంటను కట్ట నాగరాజు ట్రాక్టర్లతో ధ్వంసం చేశారని ఆరోపిస్తూ ఈ నెల 9న భీమారం పోలీస్‌స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుపై జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ బుధవారం, గురువారం రెండు రోజులుగా భూమి మోక మీదకు వెళ్లి విచారణ చేపట్టారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం అయిందా ? లేదా ? అ ని పరిశీలించారు. చుట్టు పక్కల రైతులు, గ్రా మస్తులతో మాట్లాడారు. ఏసీపీ వెంట శ్రీరాంపూర్ సీఐమోహన్, ఎస్ఐ రాములు ఉన్నారు.

## గోవింద్ నాయక్‌ను కలిసిన మాజీ మంత్రి, మాజీ ఎంపీ


గోవింద్ నాయక్ ఇంట్లో మాజీ మంత్రి, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకులు

దండేపల్లి, జూలై 11: ఖానాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్‌ను మండలంలోని లింగాపూర్‌లోని ఆయన స్వగృహంలో గురువారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వృద్ధాప్యం పైబడడంతో ఇంటి వద్దనే ఉంటున్న గోవింద్ నాయక్‌ను పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బంజారా సేవా సంఘం చేపట్టనున్న కార్యక్రమాలపై మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, ఆలిండియా బంజారా సేవాసంఘం అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌సింగ్, వర్కింగ్ అధ్యక్షుడు దీప్లాల్ చౌహాన్, నాయకులు తిరుపతి నాయక్, భాస్కర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ పాల్గొన్నారు.

# రైతులకు మేలు చేయండి


ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


మాట్లాడడానికి అవకాశం కల్పించాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

- ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో మంచి జరగాలి..
- రైతు భరోసా పథకంలో కోతలు పెట్టవద్దు..
- ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేకంగా చూడాలి..
- అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలి..
- ఉట్నూర్ రైతుభరోసా సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు
- పాల్గొన్న మంత్రులు భట్టి విక్రమార్క, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, జూలై 11(నమస్తే తెలంగాణ) : రైతుభరోసా పథకం అమలులో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులు, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు కోరారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్‌లో రైతు భరోసా పథకంపై జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను సబ్‌కమిటీ ఎదుట వెల్లడించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. పది ఎకరాల వరకు రైతు బంధు ఇవ్వాలని రైతులు సూచిస్తున్నా, వారు తమ మనసులో వేరే ఆలోచన లేకుండా అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు. వర్షాలు ఎక్కువ పడినా, వానలు లేకున్నా రైతులు పంటలు నష్టపోతారని, ఇతర జిల్లాలతో పోల్చితే ఆదిలాబాద్ జిల్లా రైతులు పదెకరాల భూమి ఉన్నా పేదవారుగా ఉన్నారన్నారు. రైతుభరోసా విషయంలో ప్రత్యక మినహాయింపు ఇవ్వాలని కోరారు. కుప్టీ ప్రాజెక్టు నిర్మాణం వల్ల బోథ్ నియోజకవర్గం సస్యశ్యామలంగా మారుతుందని, ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు పథకం ఇప్పుడు రైతు భరోసాగా మారిందన్నారు. భూస్వాములకు కాకుండా అర్హులైన వారికి రైతుబంధు ఇవ్వాలని, రైతుబీమా పథకాన్ని కొనసాగించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### కోతలు విధించవద్దు..

రైతుభరోసా పథకంలో భాగంగా సాగు భూములకు కోతలు విధించవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. జిల్లా రైతంగాన్ని ప్రత్యేకంగా పరిగణించాలని, ఇతర జిల్లాల రైతుల మాదిరి చూడవద్దని తెలిపారు. రైతులు పండించిన పంటలకు ఫసల్ బీమా వర్తింపచేయాలని, ప్రభుత్వం ప్రీమియం చెల్లించాలని కోరారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. జాబ్‌కార్డులు ఉన్న రైతు కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అటవీ భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ మాట్లాడుతూ.. పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్లాంటేషన్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్న భూముల్లో పోలీసు బందోబస్తు మధ్య మొక్కలు నాటుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. పంటలకు బోనస్ చెల్లించాలని సూచించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. కొందరు అధికారులు ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని, పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్‌లు రాజర్షి షా, అభిలాష అభినవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఉమ్మడి జిల్లా రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన రైతు భరోసా పథకంపై ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న రైతులు

## కుటుంబ నియంత్రణ పాటించాలి


నస్పూర్ పీహెచ్‌సీ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అనిత


మంచిర్యాలలో వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో

- మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత
- నస్పూర్‌లో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

సీసీసీ నస్పూర్, జూలై 11: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత కోరారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ పీహెచ్‌సీ నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ అనేది అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి ఎంతో అవసరమని తెలిపారు. దేశం మరింత అభివృద్ధి చెందడానికి జనాభాపై నియంత్రణ అవసరమని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తల వద్ద కుటుంబ నియంత్రణకు కండోమ్, గర్భనిరోధక ఇంజక్షన్, తదితర తాత్కాలిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 15 రోజులపాటు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నీరజ, అరుణ, సమత, విజయపూర్ణిమ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, దామోదర్, ప్రశాంతి, శివకుమార్, రాఘవయ్య, రాజేశ్వర్, వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

### వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ

మంచిర్యాల అర్బన్, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో ఉత్తమ సర్జన్‌గా అరుణశ్రీ, ఉత్తమ ఏఎన్ఎం రాజేశ్వరి వేమనపల్లి ఆరోగ్యకేంద్రం, ఉత్తమ సూపర్‌వైజర్‌గా మార్త, వెంకట్రావ్‌పేట్ పీహెచ్‌సీ, ఉత్తమ ఆశ కార్యకర్త డీ కవిత జైపూర్ పీహెచ్‌సీకి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇక్కడ డెమో వెంకటేశ్వర్లు, ఎస్‌వో దామోద ర్, రాజేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, మూర్తి, రత్నమాల, ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీని వాయిదా వేయాలి

**డిప్యూటీ సీఎంకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతి**


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 11 : అభ్యర్థుల ఇబ్బందుల దృష్ట్యా డీఎస్సీ పరీక్షను ఏడాది పాటు వాయిదా వేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నా రు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమావేశానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు సిలబస్ చదివేందుకు సమయం సరిపోక చాలా మంది అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడకుండా డీఎస్సీని వాయిదా వేయాలని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

- మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

ఉట్నూర్, జూలై 11 : హామీ ఇచ్చిన మేరకు కుప్టీ, అడ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం రైతు భరోసా కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించి నెలరోజుల పాటు ఇక్కడే ఉన్నానన్నారు. ఇక్కడి ప్రజల, రైతుల సమస్యలు నేరుగా తెలుసుకోవడం జరిగిందన్నారు. ఏజెన్సీలో రైతు లు వర్షాధారిత పంటలపై ఆధారపడడం, ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతరుల సమస్యలు తెలుసన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టులోగా రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాజాగా రైతుల నుంచి తీసుకున్న అభిప్రాయాలను క్రోడీకరించి నివేదిక రూపంలో శాసనసభ ముందు ఉంచుతామన్నారు. దీనిపై శాసనసభ్యుల అభిప్రాయాలను కూడా సేకరిస్తామన్నారు. న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా అందరికీ అందేలా చర్య లు తీసుకుంటామన్నారు. ఈ పథకాన్ని ఎక్కడ కూడా దుర్వినియోగం కాకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రు లు శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్‌లు రాజర్షి షా, అభిలాష అభినవ్, దీపక్ కుమార్, వెంకటేశ్ ధోత్రె, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, పాల్గొన్నారు.


ప్రాజెక్టు కట్టపై కూలిన సైడ్‌వాల్


కట్టపై బీటీ రోడ్డుకు పగుళ్లు

## గ్రంథాలయ పుస్తకాలను చదివించాలి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో పార్శి అశోక్**


మాట్లాడుతున్న డీఈవో పార్శి అశోక్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 11: విద్యార్థులు ప్రాథమిక విద్యలోనే చదవడం, రాయడం, గ్రంథాలయ పుస్తకాలను నిత్యం చదివేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో పార్శి అశోక్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, రూం టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 45 స్కూల్ కాంప్లెక్స్‌ల క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల టైం టేబుల్‌లో గ్రంథాలయ పీరియడ్ కూడా ఉండాలన్నారు. ఆ సమయంలో విద్యార్థులతో క్రమం తప్పకుండా చదివించాలని తెలిపారు. ఈ సంవత్సరం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లాలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉదయ్ బాబు, రూమ్ టూ రీడ్ సంస్థ సభ్యురాలు జెన్నిఫర్ రాణి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదపుటంచున కుమ్రం భీం ప్రాజెక్ట్


కట్టపై పగుళ్లు వచ్చిన చోట్ల కప్పిన పాలిథిన్ కవర్లు

- బీటలు వారుతున్న కట్ట.. ధ్వంసమైన సైడ్‌వాల్
- మట్టి కొట్టుకపోకుండా పాలిథిన్ కవర్లు కప్పిన అధికారులు
- భారీ వర్షాలతో పొంచి ఉన్న ముప్పు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడింది. ఇటీవల కురిసిన వర్షాలతో కట్ట కుంగిపోయి, పగుళ్లు తేలుతున్నది. ఇప్పటికే కట్టకు రక్షణగా ఉండే సైడ్‌వాల్ కూలిపోయింది. కట్టపై మట్టి కొట్టుకపోకుండా పాలిథిన్ కవర్లను కప్పి అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టారు. అదే విధంగా ప్రాజెక్టులో నీటి సామర్థ్యాన్ని సగానికే పరిమితం చేస్తున్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల్లో కుమ్రం భీం ప్రాజెక్టు అతి పెద్దది. 10 టీఎంసీల సామర్థ్యంతో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కురిసిన ఒకటి రెండు వర్షాలకే ఆనకట్ట బీటలు వారింది. భారీ వర్షాలతో కట్ట మరింత కుంగిపోయే ప్రమాదం ఉంది. కట్ట బలహీనంగా మారడంతో పూర్తి స్థాయి సామర్థ్యం 10 టీఎంసీలకుగాను 4 నుంచి 5 టీఎంసీలకే అధికారులు పరిమితం చేస్తున్నారు. ఇన్‌ఫ్లోని ఎప్పటికప్పుడు గమనిస్తూ మిగతా నీటిని గేట్లు ఎత్తి వదిలేస్తున్నారు.

### కట్ట రక్షణకు తాత్కాలిక చర్యలు ..

ప్రాజెక్టు కట్టపై సన్నగా మొదలైన పగుళ్లు పెద్దగా బీటలు వారుతున్నాయి. కట్టపై వేసిన తారు రోడ్డుకు సైతం బీటలు వస్తుండడం, కట్టకు రక్షణ నిర్మించిన సైడ్‌వాల్ వరద తాకిడికి ధ్వంసమైంది. బీటలు వారిన చోట్ల వర్షపు నీరు నేరుగా కట్టపై పడకుండా, మట్టి కొట్టుకపోకుండా పాలిథిన్ కవర్లను కప్పి ఉంచుతున్నారు. వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు రక్షణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

